క్లుప్తంగా

గొల్ల బాబూరావుకు 'బొత్స' సత్కారం



గొల్ల బాబూరావును సత్కరిస్తున్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

మహారాణిపేట: రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు జన్మదినం సందర్భంగా శనివారం మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఆయనను స్వగృహంలో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతోపాటు మాజీ మంత్రి కురసాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు బోని శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అగ్రినోవ ఫెస్ట్



ప్రదర్శన తిలకిస్తున్న అటవీశాఖ అధికారి శ్రీరామ్ నరేష్, జీఎం రమ్య, ప్రిన్సిపాల్ స్వరూప

పెందుర్తి : సుజాతానగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో శనివారం నిర్వహించిన అగ్రినోవ ఫెస్ట్ విశేషంగా ఆకట్టుకుంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీరామ్ నరేష్ బెర్లాంగ్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంపై విద్యార్థులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ సాధ్యమైనంత వరకు వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్నారు. వ్యవసాయం మానవ చరిత్రలో అత్యంత కీలకమైన ప్రక్రియ అన్నారు. ప్రతి ఒక్కరూ రైతులను గౌరవించాలన్నారు. వ్యవసాయ రంగంపై విద్యార్థులు రూపొందించిన పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఏఈఈ శ్రీలక్ష్మి, జీఎం కె.రమ్య, ప్రిన్సిపాల్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

పౌర గ్రంథాలయం నిర్వహణ భేష్



లైబ్రరీలో విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు

సీతంపేట: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డి.వి.జి.శంకరరావు శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయాన్ని సందర్శించారు. లైబ్రరీలోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఉద్యోగార్థులకు కల్పించిన సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఒక మోడల్ గ్రంథాలయంగా నిర్వహిస్తున్నారని నిర్వాహకులను ఆయన అభినందించారు. విద్యార్థులు ఏయే పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారో అడిగి తెలుసుకున్నారు. కొంతమంది విద్యార్థులు గ్రూప్–1కు ప్రిపేర్ అవడాన్ని అభినందించారు. ప్రభుత్వ గ్రంథాలయాలను కూడా ఇదే విధంగా తీర్చిదిద్దాలని శంకరరావు సూచించారు.

క్రైస్తవుల శాంతియుత ర్యాలీ

సీతమ్మధార: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మత వివక్షతో కూడిన చట్టాలు, చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా క్రైస్తవ ప్రగతి పరిరక్షణ సమాఖ్య (పీఏఐసీ) ఆధ్వర్యంలో శనివారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవ మైనారిటీల పట్ల వివక్ష ప్రదర్శిస్తూ 1950 ఉత్తర్వులకు నిరసగా జీవీఎంసీ గాంధీ విగ్రహం పార్కులో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మట్లాడుతూ 1960లో అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ క్రైస్తవ మైనారిటీలకు మాత్రమే వర్తించేలా మత స్వతంత్ర నిరోధక చట్టాలకు తెరలేపారని గుర్తు చేశారు. ఫలితంగా ఆగస్టు 10న బ్లాక్‌డేగా ప్రకటించి దేశ వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేపట్టామని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోను మతం మారిన క్రైస్తవ మైనారిటీలకు కుల నిర్మూలన చేస్తూ అదర్ క్రిస్టియన్ పేరిట ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నారని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పిస్తున్న ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తున్న చట్టాల నుంచి విముక్తి కల్పించాలని కోరారు. అంతకు ముందు అధిక సంఖ్యలో క్రైస్తవులు, సమాఖ్య సభ్యులు పలు ప్రాంతాల మీదుగా శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు ఎం.సుధాకర్‌పాల్, జేమ్స్ కుంపట్ల, కె.ఈశ్వర్ డేనియల్, ఎస్.హనీ జాన్సన్, బిషప్ ఎంఏ పాల్, పలు క్రైస్తవ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
✆ 9885181097
సాక్షి

ఈ రహదారులు.. నరకానికి నకళ్లు



రాళ్లు తేలిన సోమినాయుడుపాలెం రహదారి



గుంతలతో నిండిన మెట్టపాలెం రహదారి

మండల పరిధిలో రావాడ శివారు సోమునాయుడుపాలెం, నాయుడుపాలెం శివారు మెట్టపాలెం, వాడచీపురుపల్లి శివారు వెంకటాపురం, పరవాడ–అసకపల్లి ప్రాంతాల రోడ్లు శిథిలమై పరవాడ, లంకెలపాలెం, మంత్రిపాలెం, పెదముషిడివాడ గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు ఈ మార్గాల గుండా ప్రయాణించలేక ఇబ్బంది పడుతున్నారు. అధికారులు ఈ రహదారులకు మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు.

- పరవాడలో శిథిలమైన పలు రోడ్లు
- ప్రయాణ యోగ్యం కాక ఇబ్బంది పడుతున్న ప్రజలు



వెంకటాపురంలో రాళ్లు తేలిన రహదారి

పరవాడ: మండలంలో పలు గ్రామాల రోడ్ల దుస్థితి అధ్వానంగా మారడంతో గ్రామీణ ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. రాళ్లు తేలిన రహదారులపై ప్రయాణం సాగించడం తమ వల్ల కావడం లేదని పల్లె ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. శిథిలమైన రహదారులకు మరమ్మతులు చేయాలని పాలకులకు మొర పెట్టుకున్నా ఫలితం కనిపించడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో రావాడ శివారు సోమునాయుడు పాలెం గ్రామానికి ఏర్పాటు చేసిన రోడ్డు రాళ్లు తేలి ఏళ్లు గడుస్తున్నప్పటికీ అధికారులు రిపేర్లకు కనీస చర్యలు చేపట్టలేదని, చేసేది లేక రాళ్లు తేలిన రహదారి మీదే రాకపోకలు సాగిస్తున్నామని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. నాయుడు పాలెం శివారు మెట్టపాలెం రోడ్డు విషయానికొస్తే గత 8 ఏళ్ల నుంచి మరమ్మతులకు నోచుకోక పాత రాజన్నపాలెం, కొల్లివానిపాలెం, గండివానిపాలెం గ్రామాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రోడ్డు బాగులేక ఇక్కడ పండించే కూరగాయలను పట్టణ ప్రాంతాలకు తరలించేందుకు అష్టకష్టాలు పడుతున్నామని రైతులు పేర్కొంటున్నారు. వాడచీపురుపల్లి శివారు వెంకటాపురం రహదారి కూడా అత్యంత దారుణంగా మారింది. ఏళ్ల తరబడి రోడ్డుకు రిపేర్లు లేక రాళ్లు తేలిపోయి నడవడానికి కూడా పనికిరాకుండా ఉంది. రహదారిపై రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. ఈ రహదారిలో నిత్యం కాలేజీలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, కార్మికులు, రైతులు ప్రయాణిస్తుంటారు. కనీసం వీధి లైట్లు కూడా లేని ఈ రహదారిలో చీకటి పడితే ప్రయాణించడం భీతి గొల్పుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. చిన్నపాటి వర్షం పడినా గుంతల్లో నీరు చేరడం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నామని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీపీసీ బూడిద చెరువుల నుంచి బూడిదను సరఫరా చేసే భారీ వాహనాల రాకపోకలతో పరవాడ–అసకపల్లి రోడ్డు అధ్వాన్న స్థితికి చేరింది. నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలు ప్రయాణించడంతో రోడ్డు ధ్వంసమైంది. ఎక్కడికక్కడ భారీ గుంతలు పడి ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. భారీ వాహనాలు వెదజల్లుతున్న బూడిదతో అనేక గ్రామాల ప్రజలు నరకయాతన పడుతున్నారు. ధ్వంసమైన రోడ్లకు కనీసం మరమ్మతులు కూడా చేయని కారణంగా గుంతల రోడ్లతోనే కాలం వెళ్లదీస్తున్నామని పరవాడ, లంకెలపాలెం, మంత్రిపాలెం, పెదముషిడివాడ గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అపరాధ రుసుము విధింపు



పట్టుబడిన గ్రావెల్ లారీతో మైనింగ్ ఆర్ఐ స్వాతి

సబ్బవరం: మండలంలోని రాయపుర అగ్రహారంలో ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న వాహనాలకు రూ.38,850 పెనాల్టీ విధించినట్లు మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ స్వాతి శనివారం తెలిపారు. రాయపుర అగ్రహారంలో అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న ఒక జేసీబీ, 5 ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించిన విషయం తెలిసిందే. పట్టుబడిన జేసీబీకి రూ.30 వేలు, ఒక్కొక్క ట్రాక్టర్‌కు రూ.1,770 చొప్పున పెనాల్టీ విధించి వసూలు చేశామన్నారు. స్థల యజమాని పిల్లల అప్పలనాయుడు ఫైన్ చెల్లించడంతో యంత్రాలను వదిలిపెట్టామన్నారు. అలాగే మండలంలోని జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని వెదుళ్లనరవ శివారు కొత్తూరు, సంధ్యానగర్ కాలనీ సమీపంలో గంగవరం క్వారీ నుండి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీని శనివారం సీజ్ చేసినట్లు మైనింగ్ రాయల్టీ అధికారి స్వాతి తెలిపారు. సీజ్ చేసిన లారీని కూర్మన్నపాలెం ఆర్టీసీ డిపో కస్టడీలో ఉంచినట్లు తెలిపారు.

అప్పన్నకు విశేషంగా గరుడసేవ



గరుడసేవ నిర్వహిస్తున్న పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం ఈ సేవను ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. పూజలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఈ పూజ నిర్వహించారు.

బీవీకే కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు మృతి



వెంకటేశ్వరరావు మాస్టారు (ఫైల్)

సింహాచలం : నగరంలోని బీవీకే కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ దామెర వెంకటేశ్వరరావు మాస్టారు (81) శనివారం మృతి చెందారు. సింహాచలంలోని ప్రియాగార్డెన్స్‌లో నివాసం ఉంటున్న ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వెంకటేశ్వర రావు ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. గడిచిన నలభై ఏళ్లుగా అనేక సంఘ సంస్కరణలు చేపట్టి యువతను చైతన్య పరచడంలో కీలక పాత్ర పోషించారు. మాస్టర్ ఈకే గురుపూజా మహోత్సవాల నిర్వహణల్లో చురుగ్గా పాలుపంచుకునేవారు. మాస్టర్ ఈకే హోమియో వైద్యాన్ని పలువురుకి చేరువ చేయడంలో కూడా ఆయన ప్రత్యేక పాత్ర పోషించారు. నగరంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన రిటైర్డ్ ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు సింహాచలం వచ్చి ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. ఆదివారం ఉదయం సింహాచలంలో మాస్టారు అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ



వైభవ వేంకటేశ్వరస్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ , కుంభ హారతులు సమర్పించారు.

విద్యార్థులు లక్ష్యసాధన దిశగా సాగాలి



జ్యోతి వెలిగించి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి



విద్యార్థికి వైద్య పరీక్షలు చేస్తున్న సీపీ బాగ్చి

అల్లిపురం : విద్యార్థులు లక్ష్యసాధన దిశగా ముందుకు వెళ్లాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. సూర్యాబాగ్ పోలీస్ క్వార్టర్స్‌లో గల పబ్లిక్ అండ్ పోలీస్ అసోసియేషన్ ఫర్ స్ట్రీట్ చిల్డ్రన్ (పాపాహోం) కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సంపూర్ణ ఆరోగ్యంతో లక్ష్య సాధన దిశగా అందరూ ముందుకు వెళ్లాలన్నారు. విద్యార్థి దశ ప్రాముఖ్యతను వివరించారు. పాపాహోం అభివృద్ధికి తోడ్పడుతున్న కమిటీ సభ్యులను, దాతలను సీపీ అభినందించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని అత్యున్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా సీపీ స్వయంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పాపాహోం అధ్యక్షుడు డి.సూర్యప్రకాశరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ అస్లామ్ అరిఫ్, కార్యదర్శి వీఎస్ ప్రకాశరావు, కోశాధికారి రమేష్‌చంద్ జైన్, హెల్త్ క్యాంప్ కో ఆర్డినేటర్ డాక్టర్ కేబీ స్వామి, పాపాహోం సభ్యులు ఎంవీ రాజశేఖర్, ఎంవీవీ సత్యనారాయణ, కృష్ణారావు ఆచారి, భాస్కర శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు 'మీట్ అండ్ గ్రీట్'

మురళీనగర్: మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్స్ పార్కు మహిళా భవన్‌లో వాకర్స్ ఇంటర్నేషనల్ సభ్యులతో ఆదివారం మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వాకర్స్ డిస్ట్రిక్ట్–101 ఎలక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ సెక్రటరీ జనరల్ సీలం ఐజాక్, అదనపు సెక్రటరీ జనరల్ రాళ్లపల్లి సత్యనాథం ముఖ్య అతితులుగా పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా వాకర్స్ డిస్ట్రిక్ట్–101 పరిధిలో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై భవిష్యత్ ప్రణాళిక తయారు చేస్తామని, వాకర్స్ క్లబ్ సభ్యులు, కార్యవర్గ సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

మహిళా కళాశాలలో 'వన్ క్యాడెట్ వన్ ప్లాంట్'



కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు, అధ్యాపకులు

డాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం 'వన్ క్యాడెట్ వన్ ప్లాంట్' కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఎన్‌సీసీ అధికారి కె. గీతాంజలి నేతృత్వంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. చెట్లను కాపాడడంపై అవగాహన కల్పించే విషయమై ఈ కార్యక్రమం నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల తెలిపారు. చెట్లు ప్రకృతి ప్రసాదించిన అమూల్య వరమని, చెట్ల వల్లే ఈ పచ్చని భూమి, మన జీవితం ఆనందంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి, డాక్టర్ కేఎల్ శిరీష, డాక్టర్ జె. లావణ్య, ఎస్. అనురాధ, అధ్యాపక బృందం, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలి

ఎంవీపీకాలనీ: దేశవ్యాప్తంగా బీసీల సంక్షేమానికి కేంద్రంతో పాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లగుడు గోవిందరావు కోరారు. ఎంవీపీ కాలనీలోని ఓ హోటల్‌లో సంఘ సభ్యులతో ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గానికి జాతీయ స్థాయిలో తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. దేశంలో అత్యధిక జనాభాగా బీసీలు ఉన్నప్పటికీ వారికి ఉద్యోగ, రాజకీయ, వ్యాపార రంగాల్లో తగిన భాగస్వామ్యం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బీసీల అభ్యున్నతికి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, బీసీల సంక్షేమానికి కేంద్రం రూ.లక్ష కోట్ల బడ్జెట్‌ను కేటాయించడంతోపాటు ప్రత్యేకంగా బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీ విద్యార్థులకు ఉపకార వేతనాలను రెట్టింపు చేయాలని, బీసీ కుల వృత్తులకు వంద శాతం సబ్సిడీతో రుణాలు అందించాలని విన్నవించారు. రాష్ట్రంలో త్వరలో భర్తీ చేయబోయే నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు పూర్తిస్థాయి ప్రాధాన్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పెదిరెడ్ల సత్యం, వరుదు రాజ్‌కుమార్, పెదిరెడ్ల శ్రీనివాస్‌రావు, బర్ల పైడం నాయుడు, గంగు మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

మదర్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు నిరుపమానం



మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న చొక్కాకుల వెంకటరావు

సబ్బవరం: మదర్ చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయమని, ట్రస్టు సేవలు మరింత విస్తరించి ఎంతో మందికి సహాయం అందించాని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు ఆకాంక్షించారు. సబ్బవరంలోని స్థానిక ట్రస్టు కార్యాలయంలో ట్రస్టు ఏర్పాటు చేసి 10 వసంతాలు పూర్తి చేసుకుని 11వ వసంతంలోకి అడుగుపెట్టడంతో వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా అనేక సేవా కార్యక్రమాల ద్వారా ట్రస్టు పేదలకు ఎన్నో సేవలు చేసిందన్నారు. నిరుపేదలు, వృద్ధులకు నిత్యావసర సరకులు, దుప్పట్లు పంపిణీ చేస్తుందన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే విధంగా ఇప్పటి వరకూ పలు గ్రామాల చెందిన 2 వేల మందికి పైగా కుట్టు శిక్షణ అందించి వారికి ఉపాధి కల్పించిందన్నారు. కరోనా కష్ట కాలంలో సైతం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సేవలందించిందన్నారు. ట్రస్టు వ్యవస్థాపకుడు సత్యగంగరాజు ప్రభుత్వ ఉద్యోగాన్ని విడిచిపెట్టి వారసత్వంగా తనకు వచ్చిన కోట్ల విలువ చేసే 40 సెంట్ల భూమిని ట్రస్టు ఆశ్రమ నిర్మాణానికి రాసి ఇచ్చేశారన్నారు. ఈ సంవత్సరం ట్రస్టు ద్వారా చేపట్టే సేవా కార్యక్రమాలకు రూ.20 వేలు ఆర్థిక సాయం చేస్తున్నట్లు తెలిపారు. పేదలు, వృద్ధులకు తన చేతుల మీదుగా నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. అదే విధంగా కుట్టు పనిలో శిక్షణ పొందిన మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ట్రస్టు వ్యవస్థాపకుడు సత్యగంగరాజు మాట్లాడుతూ ట్రస్టు 15 రకాల సేవలందిస్తుందన్నారు. అనంతరం చొక్కాకుల వెంకటరావుతో పాటు పలువురిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, మాజీ సర్పంచ్ దనిమిరెడ్డి శ్రీనివాసరావు, ప్రముఖ పారిశ్రామికవేత్త బర్నికాన బాబూరావు, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకురాలు దెడ్డం పద్మావతి, నాయకులు పల్ల రమణ, పల్ల సత్యనారాయణ, ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న వెంకటేశ్వరస్వామి



తులాభారం సమర్పిస్తున్న భక్తులు

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలబోగం చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. చాతుర్మాస దీక్షలో భాగంగా శ్రీరామాయణ హవనం నిర్వహించారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద, మజ్జిగ వితరణ చేపట్టారు.

కిటకిటలాడిన సింహగిరి



సింహగిరిపై క్యూల్లో బారులు తీరిన భక్తులు

సింహాచలం: సింహగిరి శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. భక్తులతో దర్శన క్యూలు, ప్రసాద విక్రయశాల, కేశఖండనశాల, గంగధార ప్రాంగణం కిక్కిరిశాయి. సింహగిరికి వెళ్లే ఆర్టీసీ, దేవస్థానం బస్సులు రద్దీని సంతరించుకున్నాయి. ద్విచక్రవాహనాలు, కార్లతో పార్కింగ్ స్థలాలన్నీ నిండుకున్నాయి. దేవస్థానం కార్యాలయ ఉద్యోగులంతా సింహగిరిపై డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం: అనకాపల్లి జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలల్లో పలు సబ్జెక్టులు బోధించేందుకు ఖాళీగా ఉన్న అధ్యాపక, ఉపాధ్యాయ పోస్టులకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా సమన్వయకర్త ఎస్. రూపావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు సంబంధిత ఒరిజినల్, నకలు ధ్రువపత్రాలతో ఈ నెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు సబ్బవరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించే డెమో తరగతులకు హాజరు కావాలని తెలిపారు. ఇప్పటికే ఆయా ప్రవేశాలకు 14వ తేదీన డెమో తరగతులు నిర్వహించనున్నట్లు ప్రకటన విడుదల చేశామని, అయితే తేదీ మార్పు జరిగి 12నే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు సంబంధిత సబ్జెక్టుల్లో ప్రోస్టు గ్రాడ్యుయేషన్‌లో కనీసం 55 శాతం మార్కులతో పాటు బీఈడీ, టెట్ అర్హత కలిగి ఉండాలన్నారు. అదే విధంగా బాలుర పాఠశాలలకు పురుష అభ్యర్థులను, బాలికల పాఠశాలకు మహిళా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. బోధనలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఉమ్మడి జిల్లాల సమన్వయ అధికారి కార్యాలయం ఫోన్ నంబర్ 0891 2799641లో సంప్రదించాలన్నారు. దేవరాపల్లి బాలుర గురుకుల పాఠశాలలో జేఎల్ తెలుగు, కొక్కిరాపల్లి బాలికల గురుకుల పాఠశాలలో జేఎల్ జువాలజీ, కోనాం బాలికల గురుకుల పాఠశాలలో జేఎల్ కెమిస్ట్రీ, నర్సీపట్నం బాలికల గురుకులంలో పీజీటీ సోషల్ సబ్జెక్టుల్లో బోధించడంతో పాటు గొలుగొండ బాలుర గురుకులంలో పీడీ, పీఈటీ ఫ్యాకల్టీ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.

అలరించిన డ్యాన్స్ ఫెస్టివల్



డ్యాన్స్ ఫెస్టివల్‌లో పాల్గొన్న కళాకారులకు జ్ఞాపికలు అందజేస్తున్న అతిథులు

సీతంపేట: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కీర్తి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన డ్యాన్స్ ఫెస్టివల్ అలరించింది. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 50 మందికి పైగా నృత్య కళాకారులు జానపద, కూచిపూడి, కథక్ ప్రదర్శనలు చేశారు. వీరిని తీర్చిదిద్దిన నాట్య గురువులు ఆర్.రజని, అనిల్ తెలికిచర్ల, సౌమ్య, మంగళ దివ్య, బి.సుధాపౌర్ణిమ, కరణం కుమార్‌లను అతిథులు మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ అధ్యక్షుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్, బాదంగీర్ సాయి చేతుల మీదుగా సత్కరించారు. నృత్యంతో అలరించిన చిన్నారులను జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ గురువుల వద్ద నేర్చుకున్న నాట్యకళను విడిచిపెట్టకుండా ప్రాక్టీస్ చేయాలన్నారు. నాట్యం దేవుడిచ్చిన వరమని, భక్తిశ్రద్ధలతో నేర్చుకుని కోరుకున్న రంగంలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎం.వి.సుబ్రహ్మణ్యం, ఉమేష్ చంద్ర, కీర్తి అకాడమీ అధ్యక్షురాలు బిందు లీమ్మ కీర్తి పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
✆ 9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com